క్లుప్తంగా

శ్మశానవాటికకు బస్సు వితరణ

అంబర్‌పేట: అంతిమ దహన సంస్కారాలకు తోడ్పాటును అందించడం అభినందనీయమని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ప్రధాన సలహాదారుడు దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రధాన శ్మశానవాటిక అయిన హరాజ్‌పెంట శ్మశానవాటికకు సెయింట్ ఆల్ఫనోసా గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ బత్తుల దేవేందర్‌గౌడ్ స్వరాజ్ మజ్దా బస్సును దహన సంస్కారాల కోసం దేవస్థాన సేవ సమితి తరఫున అందించారు. గురువారం అంబర్‌పేట మహంకాళి ఆలయ ప్రాంగణంలో బస్సును శ్మశానవాటిక ప్రతినిధి వీరస్వామికి, బస్సు, దాని కాగితాలను అందజేశారు. లక్ష్మణ్‌గౌడ్, శంకర్‌గౌడ్, రంగంపల్లి రాజు, సుధాకర్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

నల్లకుంట: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్ చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. నల్లకుంట చైతన్యనగర్‌కు చెందిన ఎస్. మహేష్ ఆధ్వర్యంలో పలువురు బస్తీ యువకులు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే సమక్షంలో బీ ఆర్‌ఎస్‌లో చేరారు. వారందరికీ గులాబి కండువాలు కప్పి పా ర్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మాట్లాడారు. మేడి ప్రసాద్, నాయకులు భాస్కర్‌గౌడ్, శంకర్, ఇర్ఫానా సుల్తాన, చైతన్య రాజ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ రెండో యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఐపీఎం సిబ్బంది వచ్చి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల నుంచి 300 మిలీలీటర్ల చొప్పున 38 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య స్వయంగా రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ చిన్నబాబు, వలంటీర్లు, ఐపీఎం డాక్టర్ శశిధర్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

మహిళా బిల్లు ఆమోదంతో సంబురాలు



సంబరాలు చేసుకుంటున్న మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి

అంబర్‌పేట్: మహిళా బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందడం చారిత్రాత్మకమని బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి తెలిపారు. గురువారం బాగ్ అంబర్‌పేట్‌లో పలువురు మహిళలతో కలిసి ఆమె సంబరాలు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. మహిళా బిల్లు ఉభయ సభల్లో ప్రవేశపెట్టడానికి ఎమ్మెల్సీ కవిత చేసిన కృషి అభినందనీయమని అన్నారు. స్రవంతి, వాణీ, పుష్ప, ప్రసూన, మల్లేశ్వరీ, లక్ష్మి, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సందడిగా గ్రాండ్ పేరెంట్స్ డే



అంబర్‌పేట్: గ్రాండ్ పేరెంట్స్ ఆట పాటలతో మురిసిపోయారు. గురువారం డీడీ కాలనీలో బచ్‌పన్ అకాడమీ హైట్స్ పాఠశాలలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. చిన్నారులు ఈ వేడుకలకు తమ గ్రాండ్ పేరెంట్స్‌తో విచ్చేసి వారి మధ్య ఉన్న బంధాలను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సులక్షణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై కాలయాపన వద్దు



ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అమలుపై కాలయాపన చేయవద్దని అన్నారు. గురువారం ముషీరాబాద్ చౌరస్తాలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రు ఎస్సీ, ఎస్టీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి చేసిన ప్రతి పాదన తరహాలో ఓబీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించడంపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఠా జైసింహ, శివముదిరాజ్, ప్రభాకర్, శంకర్‌గౌడ్, శోభ, ప్రవీణ్, మగ్బూల్ పాల్గొన్నారు.



ముషీరాబాద్ శివాలయం చౌరస్తాలో.. అంజన్‌కుమార్‌యాదవ్



బాగ్‌అంబర్‌పేటలో జైగణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



నిమజ్జనానికి తరలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

గణపయ్యా..పూజలందుకోవయ్యా

అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గణనాథుల మండపాల వద్ద మండప నిర్వాహకులు గురువారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నేతలు మండపాల వద్దకు వచ్చి వినాయకులను దర్శించుకున్నారు. పలు ప్రాంతాల్లోని గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ల బృందం



హరినగర్‌లో ఏషియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



చిక్కడపల్లి పృథ్వీ అపార్ట్‌మెంట్‌లో..



వివేక్‌నగర్‌లో..



మోతిమార్కెట్‌లో..



శ్రీ సాయిబాబా ఆలయంలో..



పూజలో ప్రముఖ సంఘ సేవకుడు బిల్డర్ ప్రవీణ్ కుమార్



నల్లకుంటలో మయూరి కల్చరల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



బర్కత్‌పురలో.. ఎన్.శరత్ శ్యామ్ తదితరులు



చిక్కడపల్లిలో..



బాగ్‌లింగంపల్లిలో..



యువ శక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో..



గోల్నాక, అశోక్‌నగర్‌లో..



అడిక్‌మెట్‌లో ..టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్

విద్యారంగం పట్ల ప్రభుత్వాల వివక్ష

ప్రొఫెసర్ జి.హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి అత్యంత తక్కువ నిధులు కేటాయిస్తూ నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యా రంగ సమస్యలను ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు విద్యా రంగానికి తప్పనిసరిగా కేటాయించి నిధులను విడుదల చేయాలని కోరారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఉన్నత పాఠశాలన్నింటిని కేంద్రీయ విద్యాలయాల స్థాయిలో హాస్టల్ వసతి, వస్త్ర, వైద్య అవసరాలు కల్పించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కళాశాలలకు అనుగుణంగా ఉచిత హాస్టల్, మెస్ సౌకర్యం కల్పించాలని కొత్తగా ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ. కోదండరామ్, న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వర్‌రావు, వేములపల్లి వెంకటరామయ్య, గోవర్ధన్, ప్రజాపంథా నాయకులు హన్మేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రైలెక్కుతుండగా కిందపడి వ్యక్తి మృతి

కాచిగూడ: రైలెక్కుతుండగా కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌కుమార్ ఆర్ట్స్ కాలేజ్ రైల్వేస్టేషన్ వద్ద కదులుతున్న రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే పోలీసులు ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాదాలు చేస్తున్న వక్తలు

చిక్కడపల్లి: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు ప్రముఖులు కొనియాడారు. అశోక్‌నగర్ చౌరస్తాలో గురువారం పద్మశాలి ప్రజా సంఘం అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ పావని, విమలక్క హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఠాజైసింహ, వినయ్‌కుమార్, జగదీష్, శంకర్, ప్రవీణ్, చంద్రకళ, అమర్, పద్మ, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో....

అంబర్‌పేట్: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీకీ భారతరత్న ఇవ్వాలని పద్మాశాలీ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు బత్తుల సుదర్శన్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అంబర్‌పేట నియోజకవర్గం సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి గోల్నాకలోని సంఘం కార్యాలయంలో జరిగింది. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. కృష్ణా, నరేందర్, అంజయ్య, సత్యనారయణ, సత్తయ్య, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ సాధనే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి

ముషీరాబాద్: సామాజిక తెలంగాణ సాధన, అధికారంలో అట్టడుగు వర్గాలను సైతం భాగస్వామ్యం చేయడమే కొండా లక్ష్మణ్ బాపూజీకి అందించే నిజమైన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేష్ నేతృత్వంలో గురువారం ట్యాంక్‌బండ్‌లోని జలదృశ్యం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, ప్రొ. గాలి వినోద్‌కుమార్ హాజరై మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అవకాశాలను అందించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ భావిస్తే ప్రస్తుతం తెలంగాణలో పరిపాలన అందుకు విరుద్ధంగా కొనసాగుతుందన్నారు. జగన్ మోహన్, అనిల్‌కురుమా చలం, ఉపేంద్ర, కిషోర్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, రుద్ర శంకర్, ప్రొఫెసర్ వెంకటరాజం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రమణ, వినయ్‌కుమార్, జగదీష్



నివాళులర్పిస్తున్న పద్మాశాలీ సంఘం నాయకులు

రెండో విడత ‘డబుల్’ సంబురం

అంబర్‌పేట: పేదలను నేరుగా లక్ష్యధికారులను చేసే ప్రభుత్వాన్ని, పార్టీని ఆదరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తూ వారి కుటుంబానికి ఒక ఆస్తిని డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు రూపంలో అందిస్తుందని ఆయన తెలిపారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో భాగంగా రెండో విడత లక్కీ డ్రాలో 500 మందికి కేటాయించడం జరిగింది. లక్కీ డ్రాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చిన వారిని గురువారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌కి రావాల్సిందిగా అధికారులు సూచించారు. మున్సిపల్ గ్రౌండ్‌కు వచ్చిన లబ్ధిదారులకు అల్పాహారం అందించి ఎమ్మెల్యే స్వయంగా వారిని ఆర్టీసీ బస్సుల్లో బాటసింగారం వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్దకు తీసుకెళ్లారు. లబ్ధిదారులతో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి వారి ఆనందంలో పలు పంచుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. మరో నాలుగు విడుతల్లో అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు ఉంటుందన్నారు. అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, శ్రీరాములు ముదిరాజ్, మేడిప్రసాద్, లవంగం ఆంజనేయులు, రంగు సతీష్ గౌడ్ తదితరులు ఉన్నారు.



లబ్ధాదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ముషీరాబాద్‌లో వెయ్యి మందికి ‘డబుల్’ ఇళ్లు



లబ్ధిదారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: పేదల సొంతింటి కళను సహకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ఇప్పటి వరకు రెండు దఫాలలో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన వెయ్యి మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించినట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. మరో 500 ఇళ్లు పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించి కేటాయించడం జరిగిందన్నారు. గురువారం ముషీరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రెండవ విడుతలో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించేందుకు ఎన్‌టీఆర్ స్టేడియం నుంచి ఆర్టీసీ బస్సుల్లో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ర్యాలీని ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత ఎన్నికల్లో మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం కేసీఆర్ నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్–15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, వల్లాల శ్యామ్‌యాదవ్, రాకేష్‌కుమార్, శ్రీనివాస్‌రావు, మోజేస్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌ప్రసాద్, ఎస్.డి. సాయికృష్ణ, మధు, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ప్రత్యేక కోటా కల్పించాలి

కాచిగూడ: చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ప్రత్యేక కోటా కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మున్నూరుకాపు మహిళా సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు బండారి లత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా బిల్లు అమలయ్యేంత వరకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో సహా అన్ని రాజకీయ పార్టీలు మహిళలకు 40శాతం టికెట్లు ఇవ్వాలని ఆమె అన్నారు. గురువారం కాచిగూడలో జరిగిన మహిళా ప్రతినిధుల సమావేశంలో ఆమె మట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడానికి ఈ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. మహిళా రిజర్వేషన్లను ఎప్పటి నుంచి అమలు చేస్తారో కచ్చితమైన తేదీ, టైమ్‌లైన్‌ను ప్రభుత్వం ప్రకటించాలన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపడుతున్న ఉద్యమంలో బీసీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మద్దతు ప్రకటించాలని ఆమె పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బండారి లత

‘రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సంక్షేమాన్ని విస్మరిస్తోంది’



మాట్లాడుతున్న రాజేంద్రబాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల పట్ల అనుసరిస్తున్న విధానం సరైంది కాదని వారి సంక్షేమాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏ.రాజేంద్రబాబు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు గద్దర్, జర్నలిస్టు జహీర్ ఆలీఖాన్, విద్యావేత్త లక్ష్మారెడ్డికు సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం రాజేంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతినెలా మొదటి తేదీన పెన్షన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని పెండింగ్‌లో ఉన్న కరువు బత్యం వాయిదాలను వెంటనే విడుదల చేయాలని, వేతన సవరణ సంఘాన్ని త్వరితగతిన ఏర్పాటు చేసి మధ్యంతర భృతిని ప్రకటించాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కె.నాగేశ్వర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ జి.వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.వి.నర్సింగ్‌రావు, కోశాధికారి బి.నర్సయ్య, ఉపాధ్యక్షులు వి.ఆర్.దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

రుమీలకు గ్లోబల్ పీస్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న రుమీల సీతారాంకుమార్

కాచిగూడ: సుబేదార్ అమీర్ ఆలీఖాన్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ రుమీల సీతారాం కుమార్‌కు గురువారం గ్లోబల్ పీస్ అవార్డు–2023ను అందజేశారు. నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా రుమీల సీతారాంకుమార్ సమాజ అభివృద్ధికి, శాంతి, మతసామరస్యం, జాతీయ సమైక్యత, పర్యావరణ పరిరక్షణ కోసం అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ వామన్‌రావు, జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, డాక్టర్ జయసుధ, డాక్టర్ అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ చొరవతో మహిళా బిల్లుకు మోక్షం’

కాచిగూడ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ కవితను ఆమె నివాసంలో వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మడిపడిగ రాజు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చొరవ కారణంగానే మహిళ రిజర్వేషన్ బిల్లుకు మోక్షం లభించిందన్నారు. రెండు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న బిల్లును ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, వీబీజీ కోర్ కమిటీ సభ్యులు సంతోష్, సతీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కవితకు అభినందనలు తెలియజేస్తున్న మడిపడిగ రాజు

‘తానా’ అంతర్జాతీయ కవయిత్రుల సమ్మేళనంలో మమతకు చోటు



కాచిగూడ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్య వేదిక సెప్టెంబర్ 24వ తేదీన నిర్వహిస్తున్న ‘నారీ సాహిత్యభేరీ’ అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనానికి నగరానికి చెందిన రచయిత్రి డాక్టర్ కె.మమతను ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తానా వారు నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమంలో తనకు స్థానం కల్పించినందుకు తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 14 గంటల పాటు నిర్విరామంగా జరిగే సాహిత్య సమ్మేళనంలో భారత్‌తో పాటు విశ్వ వ్యాప్తంగా 15 దేశాలకు చెందిన ప్రముఖ తెలుగు కవయిత్రులు, రచయిత్రులు పాల్గొంటారన్నారు. మమతకి తానా ద్వారా అంతర్జాతీయ గుర్తింపు రావడం పట్ల బద్రుక కళాశాల అధ్యాపకులు, కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.